సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం | 17 | ఏప్రిల్ | 2025



ఉల్లి ధర తగ్గుముఖం
దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి.
వివరాలు 8లో ▸



చివరి 40 మీటర్ల వరకు..
ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో బుధవారం 54వ రోజు సహాయక చర్యలు కొనసాగాయి.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /29.3

వాతావరణం
మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఆకాశం నిర్మానుష్యంగా ఉండటంతో పాటు మేఘావృతం అవుతుంది.


న్యూస్‌రీల్

ఆర్మీ నియామకాల గడువు పొడగింపు
గద్వాల: భారత ఆర్మీ నియామకాలు 2025–26 సంవత్సరానికిగాను అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ నియామకానికి దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడగించినట్లు ఉపాధి కల్పన జిల్లా అధికారి ప్రియాంక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

వేరుశనగ క్వింటా రూ.6,429
గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 562 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ. 6429, కనిష్ఠం రూ. 3506, సరాసరి రూ. 5406 ధరలు పలికాయి. 15 క్వింటాళ్ల కంది రాగా గరిష్ఠం రూ.6129, కనిష్ఠం రూ.3029, సరాసరి రూ.6129 ధరలు వచ్చాయి. అలాగే, 148 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్ఠం రూ. 5960, కనిష్ఠం రూ. 5502, సరాసరి రూ. 5880 ధరలు పలికాయి. 2010 క్వింటాళ్ళ వరి (సోన) రాగా గరిష్ఠం రూ.2080, కనిష్ఠం రూ. 1703, సరాసరి రూ.2006 ధరలు లభించాయి.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి
ధరూరు: పశువులకు సీజనల్‌గా వచ్చే రోగాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని విధిగా టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను ప్రతి పశువుకు వేయించేలా రైతులు చూడాలన్నారు. పశువులు మేత సరిగా తినకపోవడం , నోట్లో నుంచి చొంగ కారడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తే అది గాలికుంటు వ్యాధిగా నిర్ధారించుకోవాలని, ఒకవేళ పాడి పశువులైతే పాల దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. రోగం రాక ముందే టీకాలు వేయించుకుని దాని బారిన పడకుండా పశువులను కాపాడుకోవాలని సూచించారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు టీకా పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క పాడి, పశువుల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటరాజు, సిబ్బంది రంగస్వామి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.





సరికొత్తగా..

పీయూలో సంప్రదాయ విద్యకు సాంకేతిక కోర్సుల జోడింపు

- యూజీ, పీజీ స్థాయిలో జాబ్ ఓరియెంటెడ్ సిలబస్ రూపకల్పనకు కసరత్తు
- నైపుణ్యాలు పెంపొందించి.. ఉద్యోగాలు సాధించేలా నూతన కోర్సులకు సన్నాహాలు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటివి అదనంగా చేర్చే అవకాశం
- త్వరలో బీఓఎస్ కమిటీలు.. సబ్జెక్టుల వారీగా సమావేశాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ప్రస్తుత కాలంతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఉద్యోగాలకు అవసరమైన విధంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సర్కారు సన్నాహాలు చేస్తోంది. డిగ్రీలో బీఏ, బీకాం, పీజీలో ఎంఏ, ఎంకాం వంటి సంప్రదాయ కోర్సులకు సాంకేతికత విద్యను జోడించి.. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా సరికొత్తగా బోధన చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ మేరకు పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ కళాశాలల స్థాయిలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి సిలబస్‌లో మార్పులు జరగనున్నాయి. గత వారం సీఎం రేవంత్‌రెడ్డి అన్ని యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఇందులో పీయూ వీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా సిలబస్ మార్పులపై చర్చ జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ఏ కోర్సులు చదివినా.. ఉద్యోగం వచ్చే విధంగా సిలబస్‌లో తగిన మార్పులు, చేర్పులు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం

కొత్త కోర్సులు..
కోర్సుల్లో ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, రీసెర్చ్ ఆప్టిట్యూట్, మెషిన్‌టూల్స్ వంటి వాటిని తీసుకురానున్నారు. యూజీ, పీజీ స్థాయిలో ఈ కోర్సులను అమలు చేయనున్న నేపథ్యంలో ప్రతి కళాశాల కూడా సంబంధిత అధ్యాపకులను నియమించుకోవాల్సి ఉంటుంది. పీయూలో ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జూన్ నుంచి తరగతులు ప్రారంభించేలా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో పీయూలో ఉన్న కోర్సులు బోధిస్తే.. వాటికి సంబంధించిన మార్కులు నేరుగా విద్యార్థి మెమోలో ముద్రించనున్నారు. పీయూ పరిధిలో లేని కోర్సులు బోధించినట్లయితే.. వాటికి సంబంధించి ప్రత్యేక సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించనున్నారు. ఏదైనా ఉద్యోగానికి వెళ్తే విద్యార్థి మెమో, సర్టిఫికెట్.. రెండింటిని చూపించి ఉద్యోగం పొందేందుకు ఆస్కారం ఉంటుంది.

ఉద్యోగ ఆధారిత కోర్సులు ప్రవేశ పెడతాం..



డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు.. ఆ వెంటనే ఉద్యోగాలు సాధించే దిశగా వివిధ కోర్సుల్లో అన్ని స్థాయిల్లో సిలబస్‌లో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. కొత్త కోర్సుల వల్ల సులువుగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, రీసెర్చ్ ఆప్టిట్యూట్, మెషిన్ టూల్స్, వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. సాధారణ తరగతులతో పాటు వీటిని బోధిస్తారు. అవకాశం ఉన్న కోర్సుల్లో మార్కులు నేరుగా విద్యార్థి మెమోలో ముద్రిస్తాం. అవకాశం లేని వాటికి నేరుగా సర్టిఫికెట్లు అందజేస్తాం.

– జీఎన్.శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పీయూ

ఉన్నత విద్యా మండలి సూచనలతో..



ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. చదువులు పూర్తయిన వెంటనే సాంకేతిక విద్యనభ్యసించిన వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి సూచనలతో సిలబస్‌లో 25 శాతం మార్పులకు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తాం.

– రమేష్ బాబు, రిజిస్ట్రార్, పీయూ

25 శాతం సిలబస్ మార్పు..
డిగ్రీ, పీజీ సిలబస్‌లో 25 శాతం తగ్గించి.. వాటి స్థానంలో సాంకేతిక విద్యకు సంబంధించిన కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీజెడ్‌సీ నుంచి పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంసీఏ, ఎంబీఏ వంటి అన్ని కోర్సుల్లో కూడా వీటిని భాగం చేయనున్నారు. ఆర్ట్స్‌లో కొంత బేసిక్ కోర్సులు ప్రవేశపెట్టనుండగా.. బీకాం, బీఎస్సీ వంటి కోర్సుల్లో కొంత మేర అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం.

జూన్ నుంచి బీఓఎస్ కమిటీల సమావేశాలు..
మూసధోరణిలో బోధన జరగడం వల్ల డిగ్రీలు, పీజీలు పూర్తి అయినా.. విద్యార్థులు ఉద్యోగాలు పొందే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉద్యోగాలు పొందే కోర్సులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం అందిస్తున్న ఆర్ట్స్, సైన్స్, కామర్స్ వంటి కోర్సులకు సాంకేతిక విద్యను జోడించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సబ్జెక్టుల వారీగా బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) కమిటీ పీయూకు రానుంది. ఈ కమిటీల్లో సీనియర్ ప్రొఫెసర్ చైర్మన్‌గా.. ఇద్దరు చొప్పున అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉంటారు. ఈ కమిటీలు జూన్ నుంచి విడతల వారీగా సమావేశాలు నిర్వహించి.. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్‌లో మార్పులు, చేర్పులపై పూర్తిస్థాయిలో కసరత్తు చేపట్టనున్నాయి. పీయూ పరిధిలోని 160 కళాశాలల్లో సుమారు 33వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మొదటి సెమిస్టర్‌లో చేరే వారికి ఈ సిలబస్ మార్పులు వర్తించే అవకాశం ఉంది. రెండో సెమిస్టర్ నుంచి చివరి సెమిస్టర్ వరకు పాత సిలబస్ వర్తించనుంది.

పీయూ పరిధిలోని కళాశాలల్లో కోర్సులు, విద్యార్థుల వివరాలు..

కోర్సుల పేరు	కళాశాలలు	ఫస్టియర్	సెకండియర్	థర్డియర్
డిగ్రీ	93	11,203	14,044	15,298
ఎల్‌ఎల్‌బీ	1	163	158	-
ఎంబీఏ	6	395	186	186
పీజీ	20	1,819	1,638	-
బీఈడీ	29	2,510	2,603	-
ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ	3	33	27	41
బీపీఈడీ	3	146	106	-
ఎంసీఏ	1	60	60	-
ఎంఈడీ	1	96	111	-
బీఫార్మసీ/ఫార్మ్ డీ/ ఎంఫార్మసీ	3	286	505	213

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

- పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారి
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలటౌన్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రతి వారం పురోగతిపై నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అనంతరం జరిగిన సమావేశంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వ సూచనల ప్రకారం నిర్వహించాలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై మండలాల వారీగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ పట్టణ, గ్రామాల పరిధిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకూడదన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నీటి కొరత ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటికి అవకాశం ఉన్న అన్ని మార్గాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజల తాగునీటి సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు సమన్వయంతో పైపులైన్ లీకేజీలు, మోటర్ల మరమ్మతు చేపట్టాలన్నారు.

స్ట్రాంగ్‌రూం వద్ద పటిష్ఠ భద్రత

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం వద్ద భద్రత పటిష్ఠంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా కలెక్టర్ తనిఖీ చేపట్టి, భద్రత చర్యలను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం రికార్డులు, సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం కులాంతర వివాహం చేసుకున్న జంటకు సమావేశ మందిరంలో ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. పట్టణానికి చెందిన మౌనిక, రమేష్ కులాంతర వివాహం చేసుకోగా.. ప్రభుత్వం కల్పించిన పథకం ద్వారా రూ.2.50 లక్షల ప్రోత్సాహక బహుమతికి సంబంధించిన బాండ్‌ను కలెక్టర్ వారికి అందజేశారు. సమావేశాల్లో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సంబంధిత అధికారులు నాగేంద్రం, రమేష్ బాబు, శ్రీధర్‌రెడ్డి, పరమేశ్వరి, సరోజ, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన నిర్మాణాలు



అయిజలో నిర్మించిన ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్

- ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్లపై వీడని నిర్లక్ష్యం
- వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీల్లో కానరాని పురోగతి
- గద్వాల, అయిజ మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న నిర్వహణ

అయిజ: విధిగా పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు మున్సిపాలిటీలలో ఎఫ్‌ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, అయిజ, బాదేపల్లి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, దేవరకొండ, వనపర్తి మున్సిపాలిటీల్లో ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్లు నిర్మించేందుకు రూ.18 కోట్లు వెచ్చించారు. ఈ ఖర్చులో సగభాగం ప్రభుత్వం, మిగిలిన సగభాగం పీవీపీ ఎన్‌ఫ్రాం కంపెనీ వారు ఖర్చు చేయాలనే ఒప్పందం ఉంది.

యూనిట్ ఇంచార్జ్‌లదే బాధ్యత

యూనిట్ నిర్మాణం పూర్తయిన అనంతరం 10 ఏళ్ల పాటు యూనిట్ నిర్వహణ బాధ్యతలు యూనిట్ ఇంచార్జ్‌లు తీసుకోవాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో సెప్టిక్ ట్యాంక్ యజమానితో మున్సిపాలిటీ అధికారులు ఒప్పందం చేసుకొని సెప్టిక్ ట్యాంక్‌లనుంచి మానవ విసర్జితాలను ప్లాంట్‌కు తరలించేవిధంగా చర్యలు తీసుకుంటారు. అనంతరం ప్లాంట్‌లో సాంకేతిక పద్ధతిలో మలంను ఎరువుగా మార్చుతారు. ఎఫ్‌ఎస్‌టీపీలో తయారైన ఎరువును యూనిట్ నిర్వాహకులు కిలోల చొప్పున లెక్క కట్టి విక్రయిస్తారు. అది వ్యవసాయానికి ఎరువుగా ఉపయోగపడుతుంది. శుద్ధిచేసిన నీటిని మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే హరితహారం మొక్కలకు ఉపయోగించుకోవచ్చు.

రెండు మున్సిపాలిటీల్లో వినియోగం

గద్వాల, అయిజ మున్సిపాలిటీలలో ఎస్‌ఎఫ్‌టీపీ ప్లాంట్లు వినియోగంలోకి వచ్చాయి. అయిజ మున్సిపాలిటీలో నిర్మించిన ఎస్‌ఎఫ్‌టీపీ ప్లాంట్ 2022 నుంచి ఉపయోగంలోకి తెచ్చారు. గద్వాల మున్సిపాలిటీలో 2023 ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి ఉపయోగంలోకి వచ్చింది. అయితే రెండు మున్సిపాలిటీల్లో కూడా ఇంతవరకు అధికారికంగా ప్లాంట్‌లను ప్రారంభించలేదు. వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. వడ్డేపల్లి మున్సిపాలిటీలో రూ. 55 లక్షల నిధులతో 2022లో ఎఫ్‌ఎస్‌టీపీ పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. అలంపూర్‌లో గతంలో ఏర్పాటు చేసిన ఎస్‌టీపీ (సివరేజ్ ట్రీటమెంట్ ప్లాంట్) ఉన్నందుకు ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం మంజూరును రెండు సంవత్సరాలు హోల్డ్‌లో పెట్టారు. ఎట్టకేలకు గతేడాది నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతులు లభించాయి.

ఉమ్మడి జిల్లాలోనే అయిజ ప్రథమం

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో చేపట్టిన ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్‌ల నిర్మాణం ముందుగా అయిజ మున్సిపాలిటీలో పూర్తయ్యింది. నివాస గృహాల సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి సేకరించిన మానవ విసర్జితాలను శుద్ధీకరణ చేసి ఎరువు తయారు చేసేందుకు అయిజ మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం గ్రామం సమీపంలో సుమారు రూ.1.5 కోట్లతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను గతేడాది పూర్తి చేశారు. అయిజ మున్సిపాలిటీలోని సుమారు 7వేల నివాస కుటుంబాల నుంచి సెప్టిక్ ట్యాంకుల్లోని మానవ విసర్జితాలను తరలించేందుకు ప్లాంట్ నిర్మించారు. విసర్జితాలను శుద్ధీకరుణ యూనిట్ ప్లాంట్‌లో అనారోబిక్ సేఫ్టీలైజేషన్ రియాక్టర్‌తో మెథనైజేషన్ పద్ధతిలో శుద్ధిచేసి విసర్జితం, నీటిని వేరుచేస్తారు. నీటిని పాలిసింగ్ ఫండ్‌లో పాస్ఫరేట్, సల్ఫర్ ద్వారా శుద్ధిచేసి ప్యూరిఫైడ్ వాటర్‌గా మార్చుతారు. 18 రోజుల తర్వాత మలం ఎరువుగా మారుతుంది. ఈప్రక్రియ మొత్తం ఆధునిక సాంకేతిక పద్ధతిలో జరుగుతుంది. ఒకసారికి 10 కేఎల్‌డీ (10వేల లీటర్ల సామర్థ్యం) గల విసర్జితాలు శుద్ధిచేసే అవకాశం ఉంది. అయితే అధికారికంగా ప్లాంట్‌ను ప్రారంభించకపోయినా సరే నిర్వహణ మాత్రం సజావుగా సాగుతోంది.

పారిశుద్ధ్యం మెరుగు..



అయిజ మున్సిపాలిటీలో సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించిన మానవ విసర్జితాలను శుద్ధి చేసేందుకు నిర్మించిన ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ సద్వినియోగం అవుతోంది. ఈ ప్లాంట్‌లో ద్వారా విసర్జితాలు శుద్ధిచేసి ఎరువుగా మార్చి మొక్కలకు ఉపయోగించడం మంచి విషయం.

– రాజశేఖర్, ఏఈ, అయిజ మున్సిపాలిటీ

రెండేళ్లుగా కొనసాగుతోంది



అయిజ మున్సిపాలిటీలో ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్ రెండేళ్ల క్రితం నుంచే వినియోగంలోకి వచ్చింది. గద్వాలలో కూడా వినియోగంలో ఉంది. అలంపూర్‌లో, వడ్డెపల్లిలో ఇంకా పనులు పూర్తి కాలేదు. పనులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తాం.

– నర్సింగరావు, అడిషనల్ కలెక్టర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి



కొండేరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఎర్రవల్లి: రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం మండలంలోని కొండేరు గ్రామంలో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 17శాతం తేమ వచ్చేలా వడ్లను ఎండబెట్టాలని, తాలు, రాళ్లు, మట్టి పెల్లలు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు.

ముచ్చటగా మూడుసార్లు ప్రారంభం



ఎమ్మెల్యే కంటే గంట ముందు అదే కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ దొడ్డప్ప

ఒక్క కొనుగోలు కేంద్రాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పోటాపోటీగా మూడు సార్లు ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొండేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. అయితే ఈ కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 15న మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు మొదటి సారి ప్రారంభించారు. బుధవారం ఉదయం అలంపూర్ మార్కెట్‌యార్డు చైర్మెన్ దొడ్డెప్ప రెండవసారి ప్రారంభించారు. ఇది జరిగిన గంట వ్యవధిలోనే స్థానిక ఎమ్మెల్యే విజయుడు ముచ్చటగా మూడోసారి ప్రారంభించడం గమనార్హం. దీనిపై ఏపీఎం కుర్మయ్యను వివరణ కోరగా.. మొదటిసారి బీఆర్‌ఎస్ నాయకులు తమకు సమాచారం లేకుండానే ప్రారంభించారని, రెండవసారి ప్రారంభానికి వచ్చిన అలంపూర్ మార్కెట్‌యార్డు చైర్మన్ దొడ్డెప్పకు ఎమ్మెల్యే వస్తున్నారన్న విషయాన్ని చెప్పామన్నారు. గంట వ్యవధిలోనే మూడోసారి ఎమ్మెల్యే ప్రోటోకాల్ ప్రకారం ప్రారంభించారని తెలిపారు.

ఫలించిన రైతుల ఆందోళన

జూరాల ఎడమ కాల్వకు నీటి విడుదల

- చివరి తడిగా ప్రకటించిన అధికారులు
- మరో తడి ఇవ్వాలంటున్న రైతన్నలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ ఆయకట్టులో వరి సాగు చేసిన రైతులు తమకు నీరు అందడం లేదని, పంటలు వాడుముఖం పడుతున్నాయంటూ ప్రాజెక్టు రహదారిపై రెండు పర్యాయాలు చేసిన ఆందోళనకు ఫలితం దక్కింది. రైతుల ఆవేదనను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రాజెక్టు ఉన్నతాధికారులకు విన్నవించడంతో ఎట్టకేలకు చివరి తడిగా రెండురోజుల పాటు నీటిని అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు బుధవారం జూరాల ఎడమ కాల్వకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే నీటిని విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎడమ కాల్వ పరిధిలోని అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో అత్యధికంగా వరి సాగు చేయడంతో ఇరు మండలాల ప్రజలు సాగునీరు కావాలంటూ వారం రోజుల్లో రెండు పర్యాయాలు ఆందోళన చేపట్టారు.

మరోతడి అవసరమే..

ఆత్మకూర్ మండలంలోని తూంపల్లి, కత్తేపల్లి, ఆరేపల్లి, మెట్లంపల్లి, జూరాల గ్రామాలతో పాటు ఇతర గ్రామాల ఆయకట్టు రైతులు ఆలస్యంగా వరి సాగు చేయడంతో సమస్య జఠిలంగా మారింది. అధికారుల అంచనా ప్రకారం మార్చి చివరి వారంలోనే పంట చేతికందాల్సి ఉంది. ఆలస్యంగా సాగు చేయడంతో 15 రోజుల తర్వాతే పూర్తిస్థాయిలో వరిపంట చేతికందే పరిస్థితి ఉంది. చివరి తడిగా బుధవారం నుంచి రెండురోజుల పాటు నీటిని వదులుతుండగా.. వచ్చేవారం రెండ్రోజుల పాటు నీటిని అందిస్తే పంటలు చేతికందుతాయంటున్నారు. జలాశయంలో నిల్వ నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుండటంతో ఇదే చివరితడిగా వదులుతున్నామని, పొదుపుగా వాడుకోవాలని సూచిస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఎత్తిపోతల రైతులు గట్టెక్కినట్లే..

జూరాల ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు చివరిసారిగా అందిస్తున్న నీటితో తమ పంటలు చేతికందే అవకాశం ఉందని రైతులు తెలిపారు. సాగునీరు వదిలిన వెంటనే ఆయకట్టు పరిధిలోని మూలమళ్ల, మస్తీపురం, సింగంపేట, ఖానాపురం, అమరచింత, పాంరెడ్డిపల్లిలో రైతులు వెయ్యి ఎకరాల వరి సాగుచేశారు. పొట్టదశలో ఉన్న వరి పైరుకు ప్రస్తుతం అందిస్తున్న సాగునీరు ఊపిరి పోసేలా ఉందని, పంట చేతికందుతుందనే ఆశలో ఉన్నారు.



మస్తీపురం శివారులో ఎండుముఖం పట్టిన వరి పంట

రెండ్రోజుల పాటు సరఫరా..
ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనల మేరకు జూరాల ఎడమ కాల్వ పరిధిలోని అమరచింత, ఆత్మకూర్ మండలాల రైతులకు సాగునీరు రెండురోజుల పాటు వదులుతున్నాం. రోజువారీగా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించాం.

– శ్రీనివాస్‌రెడ్డి ఎస్‌ఈ, జూరాల జలాశయం

క్లుప్తంగా

వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి


తిరుపాలు (ఫైల్)

మానవపాడు: వడదెబ్బకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మానవపాడు మండలం చెన్నిపాడులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చెన్నిపాడు గ్రామానికి చెందిన తిరుపాలు (58) మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ విజయశంకర్, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య చిట్టెమ్మ, కుమారులు చిరంజీవి, రాజేశ్, కూతురు అనిత ఉన్నారు. తిరుపాలు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


కాశీనాథ్ నాయుడు (ఫైల్)

మానవపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రం సమీపంలోని ఎన్‌హెచ్-44పై బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ వివరాల మేరకు.. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని పెద్దమారూరు గ్రామానికి చెందిన కాశీనాథ్ నాయుడు (32) కర్నూలులోని ఆటో షారూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం కర్నూలు నుంచి పెద్దమారూరుకు బైక్‌పై వెళ్తుండగా.. మానవపాడు స్టేజీ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. గమనించిన స్థానికులు అతడిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య గాయత్రి, కొడుకు, కూతురు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

రాజాపూర్(బాలానగర్): ప్రమాదవశాత్తు చెరువులో పడి రెండు రోజుల క్రితం గల్లంతైన యాదయ్య మృతదేహం బుధవారం లభ్యమైంది. మండలంలోని మోతిఘనాపూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువులో గంగధర్‌పల్లి గ్రామానికి చెందిన శివకుమార్, యాదయ్యలు గల్లంతుకావడంతో మంగళవారం శివకుమార్ మృతదేహం లభ్యం కాగా, ఈరోజు యాదయ్య మృతదేహం లభ్యమైంది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు.

తేనెటీగల దాడిలో గొర్రెల కాపరికి గాయాలు


గాయపడిన ఎల్లయ్య

మన్ననూర్: తేనెటీగల దాడిలో గొర్రెల కాపరికి తీవ్రగాయాలైన ఘటన మన్ననూర్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అమ్రాబాద్‌కు చెందిన గొర్రెలకాపరి నోముల ఎల్లయ్య రోజు మాదిరిగా తన గొర్రెల మందను మేత కోసం మన్ననూర్ సమీపంలోని నీరంజన్ షావలి దర్గా సమీపంలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఓ చెట్టుకు ఉన్న తేనె తుట్టెలోని తేనెటీగలు ఒక్కసారిగా ఎల్లయ్యపై దాడి చేశాయి. గమనించిన తోటి గొర్రెల కాపరులు అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు.

బాలల హక్కుల రక్షణ కోసం
విస్తృత ప్రచారం చేయాలి


శిశుగృహలో స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ రూరల్: బాలల రక్షణ కోసం చట్టం నిర్దేశించిన హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు వందనగౌడ్, వచన్‌కుమార్, మరిపల్లి చందన, ప్రేమ్‌లత అగర్వాల్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిశుగృహ, స్టేట్ హోమ్, జువైనల్ జస్టిస్ బోర్డులను సందర్శించారు. ముందుగా శిశుగృహను సందర్శించిన కమిషన్ సభ్యులు పిల్లల గురించి, అక్కడ ఉన్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు పిల్లల గురించి శిశు గృహ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ శిశుగృహలో ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని చెప్పారు. స్టేట్‌హోంలో ఉన్న యువతులకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం డీడబ్ల్యూఓ జరీనాబేగంతో కలిసి జిల్లాలోని పిల్లల వివరాలపై సమీక్షించారు. బాల్య వివాహాలు జరగకుండా కఠినచర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులు సూచించారు. బాల్య వివాహాల వివరాలపై ఎప్పటికప్పుడు కమిషన్‌కు నివేదించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పిల్లల కోసం పని చేస్తున్న ఎన్జీఓలను సమన్వయం చేసుకొని చిన్నారులకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని తెలిపారు. పిల్లల సంరక్షణ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు అన్ని వసతులు కల్పించాలని అన్నారు. పిల్లల హక్కుల రక్షణ కోసం స్టేట్ కమిషన్ ఉందనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నయిమొద్దీన్, సభ్యులు మాణిక్యప్ప, విజయకుమార్, జేజేబీ సభ్యులు గేస్ సీడీపీఓ శైలాశ్రీ, ఏసీడీపీఓ వెంకటమ్మ, డీసీపీఓ నర్మద, శిశుగృహ మేనేజర్ గణేష్‌బాబు, సూపర్‌వైజర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి ధర తగ్గుముఖం

- క్వింటా గరిష్టంగా రూ.1,500.. కనిష్టంగా రూ.వెయ్యి


మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఉల్లి

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన ఉల్లి వేలంలో ధరలు మరింత పడిపోయాయి. మూడు వారాలుగా నిలకడగా ఉన్న ధరలు.. ఈ వారం మరింత తగ్గడంతో వినియోగదారులు పెద్దఎత్తున కొనుగోలు చేశారు. మార్కెట్‌లో ఎక్కడ చూసినా కొనుగోలుదారులు కనిపించారు. మార్కెట్‌కు దాదాపు 5 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. ఉదయం పదికి వేలం ప్రారంభంకాగా.. మధ్యాహ్నం వరకు కొనసాగింది. అయితే సమయం సరిపోకపోవడంతో చాలా మంది వ్యాపారులు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి విక్రయాలు సాగించారు.

ధరలు ఇలా..

ఉల్లి క్వింటా గరిష్టంగా రూ.1,500 పలికింది. గత వారంతో పోలిస్తే దాదాపు రూ.500 తగ్గింది. కనిష్టంగా రూ.1000 వరకు వచ్చింది. గత వారంతో పోలిస్తే సుమారు రూ.600 వరకు తగ్గింది. నాణ్యమైన ఉల్లి 50 కిలోల బస్తా రూ.600 నుంచి రూ.750 వరకు విక్రయించారు. రెండో రకం ఉల్లిని రూ.500 నుంచి రూ.550 వరకు విక్రయించారు.

పోటాపోటీగా..

మార్కెట్‌లో ఉల్లిని తూకం వేసి అమ్మే వరకు చాలా ఖర్చు వస్తుందని భావించిన పలువురు రైతులు పొలం వద్దే 50 కిలోల బస్తాలు తయారు చేసి ట్రాక్టర్లపై తెచ్చి రోడ్డుపైనే విక్రయించారు. రూ.600 నుంచి రూ.700 వరకు బస్తా విక్రయించడంతో చాలామంది కొనుగోలు చేశారు. ఉదయం మార్కెట్ తెరవక ముందే 7 గంటల నుంచే ఉల్లి విక్రయాలు ప్రారంభమయ్యాయి. దాదాపు పది ట్రాక్టర్ల ఉల్లిని రైతులు బయటనే విక్రయించారు.

చివరి 40 మీటర్ల వరకు చేరితేనే ఆనవాళ్లు


సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న అధికారులు

- ఎస్‌ఎల్‌బీసీలో కార్మికుల జాడ కోసం 54 రోజులుగా సహాయక చర్యలు


సొరంగం లోపలకి లోకో ట్రైన్‌లో వెళ్తున్న సహాయక సిబ్బంది

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ)సొరంగం లోపల బుధవారం సైతం సహాయక చర్యలు కొనసాగాయి. 54 రోజులుగా ఆరుగురి కార్మికుల ఆచూకీ కోసం సహాయక సిబ్బంది నిర్విరామంగా తవ్వకాలు చేపడుతున్నారు. ఇంత వరకు ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో సొరంగంలో చిక్కుకున్న కార్మికులు నిషేధిత ప్రదేశం 40 మీటర్ల పరిధిలో ఉన్నారనే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, ఈనెల 20 వరకు ప్రభుత్వం విధించిన గడువులోగా తవ్వకాలు పూర్తి చేసేందుకు సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. 50మీటర్ల పొడవు, 3 మీటర్ల ఎత్తు మేర సహాయక చర్యలు చేపట్టాల్సి ఉంది. సొరంగం లోపల ఐదు ఎస్కవేటర్లు, బాబ్ క్యాట్లు బండరాళ్లను తొలగిస్తుండగా.. డీ2 ప్రదేశంలో తొలగించిన శిథిలాలను కన్వేయర్ బెల్టు ద్వారా సొరంగం బయటకు తరలిస్తున్నారు. అలాగే, ప్లాస్మా కట్టర్‌తో టీబీఎం బాగాలు కత్తిరించి స్టీల్, బండరాళ్లను లోకో ట్రెన్ ద్వారా దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది బయటకు పంపిస్తున్నారు. ఇచ్చిన టాస్క్ ప్రకారం నిషేధిత ప్రదేశం వరకు ఉన్న శిథిలాలను తొలగించే పనిలో సహాయక బృందాలు నిమగ్నమైయ్యారు. శిథిలాల కింద ఇప్పటి వరకు ఆరుగురి కార్మికుల అచూకీ లభ్యం కాలేదు. సహాయక చర్యలు చేపట్టి సుమారుగా రెండు నెలలు కావస్తుండటం, కార్మికుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో సహాయక బృందాల్లో రోజురోజుకు టెన్షన్ పెరుగుతుంది. చివరి వరకు తవ్వకాలు చేపడితే తప్పా అచూకీ లభ్యం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

బండరాళ్ల తొలగించే ప్రక్రియ వేగవంతం

సొరంగం లోపల సహాయక సిబ్బంది బండరాళ్ల తొలగించే ప్రక్రియను వేగవంతం చేశామని ప్రత్యేక అధికారి శివశంకర్ అన్నారు. దోమల పెంట ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లేట్ వద్ద బుధవారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సొరంగం లోపల చేపడుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు పూర్తి సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నారని, విధిగా ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్,విజయ్‌కుమార్,జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజనీర్ సంజయ్‌కుమార్ సింగ్,సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య,ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి,దక్షిణ మధ్య రైల్వే అధికారి రవింద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

12.75 క్వింటాళ్ల నకిలీ విత్తనాల పట్టివేత


కుర్తిరావులచెర్వులో పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

మల్దకల్: మండలంలోని కుర్తిరావుల చెర్వులో 12.75 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నందీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సీడ్ సబ్ ఆర్గనైజర్ శ్రీను అలియాస్ రాజు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం దగ్గర ఏర్పాటు చేసిన షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 12.75క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో షెడ్డులో నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని, సీడ్ సబ్ ఆర్గనైజర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడులలో వ్యవసాయాధికారి రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై పోక్సో కేసు?

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ మున్సిపాల్టీ పరిధిలోని నాగనూలు కస్తుర్బాగాంధీ బాలిక పాఠశాలలో వారం రోజుల క్రితం ఓ విద్యార్థినిని స్టడీ అవర్‌కు ఆలస్యంగా వచ్చిందని ఉపాధ్యాయురాలు 3గంటలు నిలబెట్టడంతో విద్యార్థిని మనస్థాపానికి గురై చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విధితమే. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని మరోమారు కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు మంగళవారం 4గంటల పాటు పాఠశాలలో నిరసన తెలిపారు. వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయురాలు పాఠశాలలో చాలా రోజులుగా విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేయడంతో ఉపాధ్యాయురాలిపై పోక్సో కేసు నమోదైనట్లు విశ్వసనీయ సమాచారం. మహిళా ఉపాధ్యాయురాలు విద్యార్థినులను పలు రకాలుగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయురాలిపై పోక్సో కేసు నమోదుపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా స్పందించేందుకు నిరాకరించారు.

కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం

మహమ్మదాబాద్: కుటుంబ కలహాలతో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని మన్సూర్‌పల్లి తండాకు చెందిన అంజిబాయికి షాద్‌నగర్‌కు చెందిన తుల్షానాయక్ (32)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఇటీవల అంజిబాయి తన తల్లిగారి ఊరైన మన్సూర్‌పల్లి తండాకు వచ్చింది. భర్త తుల్షానాయక్ కూడా అత్తగారింటికి వచ్చాడు. బుధవారం మరోసారి వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన తుల్షానాయక్ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే 108 అంబులెన్స్‌లో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతుడికి ముగ్గురు సంతానం ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

అల్ప్రాజోలం పట్టివేత

నిజామాబాద్‌రూరల్: నిజామాబాద్ నగరంలోని జీజీ కాలేజ్ సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయం వద్ద కిలో అల్ప్రాజోలం, రూ.3.50 లక్షల నగదును పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ట్రెయినీ ఐపీఎస్ సాయికిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన పాత నేరస్తుడు గంధం శ్రీనివాస్ అనే వ్యక్తి కారులో వచ్చి జిల్లా కేంద్రంలో జీజీ కాలేజ్ సమీపంలో అల్ప్రాజోలం విక్రయిస్తున్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి అతడిని పట్టుకున్నారు. నిందితుడు ఇప్పటి వరకు ఎవరెవరికి విక్రయించాడో వివరాలు సేకరించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బొట్లకుంట కాటమయ్య గౌడ్, మల్లి అనిల్‌గౌడ్, ఇడిగి శ్రీనివాస్‌లకు అల్ప్రాజోలంను విక్రయించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. అప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవారు వెళ్లిపోవడంతో పోలీసులు చాకచాక్యంగా వ్యవహరించి నిందితుడితో ఫోన్ చేయించారు. వారు రాగానే అరెస్టు చేశారు. నిందితుల నుంచి కిలో అల్ప్రాజోలం, రూ.3.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి సమష్టి కృషి


సమావేశానికి హాజరైన ధర్మకర్తలు

అలంపూర్: అలంపూర్ ఆలయాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయాల్లో ధర్మకర్తల మండలి సాధారణ సమావేశం జరగగా.. చైర్మన్‌తో పాటు ఈఓ పురేందర్‌కుమార్, ధర్మకర్తలు హాజరయ్యారు. ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించినట్లు ఆయన తెలిపారు. ఆలయాల అభివృద్ధి ఉన్నత కమిటీ, కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని.. పునరుద్ధరణకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేయనున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను నివేదించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు పొందాల్సిన అంశాలను చర్చించినట్లు వివరించారు. 2025-2027 సంవత్సరానికి సంబంధించి కొలు వేలం నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవడానికి ఆలయ ధర్మకర్త మండలి తీర్మానించిందన్నారు. సమావేశంలో ధర్మకర్తలు జగదీశ్వర్‌గౌడ్, జగన్మోహన్‌నాయుడు, అడ్డాకుల వెంకటేశ్వర్లు, గోపాల్, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరగుట్టలోనే చిరుతల మకాం



నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల దేవరగుట్టలో రెండు చిరుతలు వారం రోజులుగా మకాం వేశాయి. గుట్టలోని గుహలను ఆవాసంగా మార్చుకున్నాయి. బుధవారం రెండు చిరుతలు ఒకదాని తర్వాత మరొకటి బయట తిరిగి.. మళ్లీ గుహలోకి వెళ్లిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. చాలా వరకు చిరుతలు తమ స్థావరాన్ని మారుస్తూ వస్తాయి. కానీ ఇక్కడ మాత్రం రెండు చిరుతలు దేవరగుట్టను వదలడం లేదు. ఇందుకు అనారోగ్యం కారణమై ఉండవచ్చని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్ అనుమానం వ్యక్తంచేశారు. గుట్ట పరిసరాల్లో పశువులను ఉంచరాదని.. ప్రజలు సైతం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాగా, దేవరగుట్ట పరిసరాల్లోని కుక్కలను చిరుతలు హతమార్చి ఆహారంగా తీసుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు.

చెరువు మట్టితో భూసారం


వ్యవసాయ పొలంలో వేసిన చెరువు మట్టి

పాడి-పంట
అధికారి సలహా: సక్రియానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

అలంపూర్: పంటల సాగులో ప్రధాన భూమిక భూసారానిదే. భూమిలో శక్తి ఉంటేనే దిగుబడులు ఆశించిన మేరకు వస్తాయి. భూసారం తగ్గితే తెగుళ్లు, పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచించారు. పెట్టుబడులు పెరగడంతో పాటు పంట నాణ్యత తగ్గుతుందని వివరించారు. వీటిని తట్టుకోవడానికి భూసారం అవసరమని వివరించారు.

భూసారం పెంపు ఇలా..

చెరువు పూడిక మట్టితో భూమి నాణ్యత, తేమను నింపుకొనే శక్తిని పెరుగుతుంది. నీటి వినియోగ సామర్థ్యంతో పాటు భూమిలోని సారం పెరగడానికి దోహద పడుతుంది. మట్టి పీహెచ్ తగ్గి సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు పెరిగి అధిక దిగుబడి వస్తోంది. సేంద్రియ కర్బనం ఎక్కువగా ఉంటే మినరలైజేషన్ అధికంగా జరిగి మొక్కల పెరుగుదల ఉంటుంది.

పండ్ల తోటల్లో..

మామిడి, జామ, దానిమ్మ, బత్తాయి తదితర పంటలకు చెరువు మట్టి వాడకం వల్ల వేరు వ్యవస్థ బలంగా విస్తరించి ఏపుగా పెరుగుతుంది. దీంతో భూమిలో తేమ నిలుపుకొనే శక్తి పెరుగుతుంది. పాదుల్లో మల్చింగ్ మాదిరిగా ఉపయోగపడుతుంది. ఎకరానికి 10 కిలోల చెరువు మట్టిని వేసుకోవచ్చు.

కూరగాయల సాగులో..

టమాటా, బెండ, వంకాయ తదితర పంటల సాగులో అధిక దిగుబడుల కోసం ఎరువులు ఎక్కువగా వాడటం జరుగుతుంది. దీంతో పెట్టుబడి విపరీతంగా పెరుగుతుంది. కూరగాయల సాగుచేసే పొలాల్లో ఎకరాకు 8 నుంచి 10 ట్రాక్టర్ల చెరువుమట్టి ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నితే మంచి నాణ్యతగల పంటలు వస్తాయి. పెట్టుబడి తగ్గుతుంది. అంతేగాక తేమ శాతం కూడా తగ్గకుండా ఉంటుంది.

ఒక కిలో చెరువు మట్టిలో ఉండే పోషక విలువలు ఇలా
(మిల్లీ గ్రాముల్లో)..

నత్రజని	భాస్వరం	పొటాష్	కర్బనం
720	35	310	0.5

జింక్	బోరాన్	మేలుచేసే సూక్ష్మజీవుల సాంద్రత
2.8	0.8	308

గంధకం 18

కుక్కల దాడిలో జింక మృతి

బిజినేపల్లి: మండలంలోని కిమ్యా తండాలో కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన ఈనెల 12న జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం మరో జింక తండాలోకి రాగా వీధి కుక్కలు దాడి చేయడంతో స్థానికులు కాపాడారు. అనంతరం అడవిలోకి పారిపోయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు బుధవారం చనిపోయిన జింక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల నిర్వాహణ లోపం కారణంగానే జింక మృతి చెందినట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు.